సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి.. చిత్రంలో మదనపల్లె అభ్యర్థి షాజహాన్‌బాషా, మూడు పార్టీల నేతలు



## రాజకీయాన్ని వ్యాపారం చేశారు

- జిల్లాల పునర్విభజనపై పునరాలోచిస్తాం
- ఆత్మీయ సదస్సులో రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె, ఏప్రిల్ 3: రాజకీయం అంటే సేవ, అభివృద్ధి అలాంటి పవిత్ర రంగాన్ని పెద్దిరెడ్డి కుటుంబం వ్యాపారం చేసేసిందని మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో మైన్ నుంచి వైన్ వరకూ ప్రకృతి సంపద నుంచి ప్రాజెక్టుల వరకూ లూటీ చేశారని ఆరోపించారు. పథకాలు వారికే, ప్రాజెక్టులు వారివే, చివరకు ఆ పనులు చేసేది వారేనన్నారు. ఏపీ విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన దానికంటే జిల్లాల పునర్విభజనతో ఎక్కువ నష్టం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడగానే మదనపల్లె జిల్లా కేంద్రంతో పాటు జిల్లాల విభజనపై పునరాలోచిస్తామని, ఈ విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా చర్చిస్తానని హామీ ఇచ్చారు. మైనార్టీలను మభ్యపెట్టేందుకు ఇతర పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, ఆ ఉచ్చులో పడొద్దని సూచించారు. బీజేపీ మైనార్టీలకు వ్యతిరేకం కాదని చెప్పిన ఆయన ఇటీవల బీజేపీ మంత్రులు మైనార్టీలకు వ్యతిరేకంగా మాట్లాడితే, అలాంటి వారిని నలుగురిని ప్రధాని నరేంద్రమోదీ సాధారణ ఎన్నికల్లో సీట్లు ఇవ్వకుండా పక్కన పెట్టేశారని గుర్తు చేశారు. ఆరు ఇస్లామిక్ దేశాలు ప్రధాని నరేంద్రమోదీని, మనదేశంలో అత్యున్నత పురస్కారం భారతరత్న లాంటి పురస్కారాలతో సత్కరించాయన్నారు. తాను సీఎంగా ఉన్న మూడున్నరేళ్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలకు ఏడాదికి రూ.280 కోట్ల చొప్పున రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో తొమ్మిది వేల ఎకరాల భూమిని సేకరించి, రూ.30 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు, 30 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించి, పార్లమెంటులో చట్టం చేయించానని, ఇదే జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీగా ఉండి ఏ రోజూ వీటి గురించి మాట్లాడలేదని, అసలు అవి ఉన్నట్లు కూడా ఆయనకు తెలియదని, ఆయనకు తెలిసిందల్లా కాంట్రాక్టు పనులు, వాటిని క్యాష్ చేసుకోవడమేనని స్పష్టం చేశారు. మదనపల్లె ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, ఈ అయిదేళ్ల వైసీపీలో చేపట్టిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది నవంబరులో మదనపల్లెకు వచ్చిన సీఎం జగన్ మైనార్టీ ఎమ్మెల్యే వినతి మేరకు రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారని, అయితే ఇప్పటికీ పైసా ఇవ్వలేదన్నారు. ఇందులో మసీదు నిర్మాణానికి రూ.5 కోట్లు ఉండగా, అయిదు పైసలు కూడా ఇవ్వకపోవడం చూస్తే మైనార్టీల పట్ల వైసీపీకి ఉన్న ప్రేమ ఎలాంటిదో అర్థమవుతుందని తెలిపారు. పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అయిదేళ్లలో డీకేటీ, ప్రభుత్వ భూములు కబ్జా చేసేశారని, మరోసారి అధికారం ఇస్తే రానున్న అయిదేళ్లలో మన పట్టా భూములు కూడా మిగలవని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. పార్లమెంటు అభ్యర్థితో పాటు ఏడుగురు అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత మనదేనన్నారు. జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, మైనార్టీ నేత పఠాన్ ఖాదర్‌ఖాన్, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్, ఎంఆర్‌పీఎస్ నరేంద్ర, యల్లంపల్లె ప్రశాంత్, దారం అనిత, జంగాల శివరాం, ఆర్.నీలకంఠ తదితరులు ప్రసంగించారు. అనంతరం మాజీ సీఎంతో పాటు సదస్సుకు విచ్చేసిన నేతలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముజీబ్‌హుస్సేన్, టీడీపీ నేతలు మార్పూరి సుధాకర్‌నాయుడు, ఎస్.ఎ.మస్తాన్, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఈసీ హెచ్చరించినా వీరు మారరా!

- వాట్సప్ గ్రూపుల్లో అధికార పార్టీకి అనుకూలంగా వలంటీర్ల ప్రచారం

చిన్నమండెం, ఏప్రిల్ 3: రాజకీయ పార్టీల కార్యక్రమాలకు దూరంగా వలంటీర్లు ఉండాలని ఎన్నికల కమిషన్ హెచ్చరించిన వలంటీర్లు మాత్రం మారడం లేదు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటరీ చొప్పున ప్రభుత్వం నియమించింది. అయితే ఈ 50 ఇళ్లను ఒక వాట్సాప్ గ్రూప్‌గా క్రియేట్ చేసి గతంలో ఏవైనా సమాచారాలు ప్రజలకు తెలియజేసేవారు. అయితే చాకిబండ గ్రామ పంచాయతీలోని నా ఊరు నా బాధ్యత అనే గ్రూపులో ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి అధికార వైసీపీకి అనుకూలంగా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ప్రతిరోజూ వాట్సాప్ సందేశాలు, వీడియోలను గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. ఇదే విషయమై ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, ఎవరైనా తమ దృష్టికి తీసుకొస్తే విచారిస్తానని తెలిపారు.




తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా వలంటీర్ పెట్టిన వాట్సాప్ సందేశం

## 'అధికార' దాహానికి.. పండుటాకులు

# విల..విల..

- వృద్ధులు, వికలాంగుల పెన్షన్‌లో అధికార పార్టీ నాయకుల హైడ్రామా
- ప్రభుత్వం డబ్బు ఇవ్వకుండానే.. పెన్షనర్లను రెచ్చగొట్టిన వైనం
- ఉదయం నుంచి సచివాలయాల వద్ద పెన్షనర్ల పడిగాపులు




కలకడ సచివాలయం వద్ద పెన్షన్ల కోసం వేచి ఉన్న మహిళలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార దాహానికి బుధవారం జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో పాటు ప్రభుత్వం నుంచి సామాజిక పెన్షన్లు పొందుతున్న వారు ఎండకు విలవిల్లాడిపోయారు. ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవాలని చూస్తున్న వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై బురద చల్లడానికి నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి పెన్షన్లు పొందుతున్న వారిని ఇబ్బందులకు గురి చేసింది. వైసీపీ వారు చెప్పిన మాటలు విని బుధవారం ఉదయం నుంచి సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు.



రైల్వేకోడూరు సచివాలయం-2 వద్ద పెన్షన్ కోసం వృద్ధుల ఎదురు చూపులు



సంబేపల్లె కోటిరెడ్డిగారిపల్లె సచివాలయం వద్ద పెన్షన్ కోసం వృద్ధుడి పడిగాపులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వలంటీర్ల ద్వారా తాము నెల నెలా ఇంటికే పెన్షన్లు తెచ్చిస్తుంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కక్ష కట్టి వలంటీర్లను విధుల నుంచి లేకుండా చేసిందని, దీంతో ఈసారి ఇంటి వద్దకు పెన్షన్లు ఇవ్వలేకపోయామని అధికార పార్టీ హైడ్రామాకు దిగింది. కొందరు పెయిడ్ ఆర్టిస్టులతో పెన్షన్ల విషయమై నానా రచ్చ చేయించింది. అయితే వాస్తవానికి ఈసారి ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వలేకపోవడానికి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కనిపిస్తోంది. ఈనెల 3వ తేదీ పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. ఈనెల 1, 2 తేదీలు బ్యాంకులకు సెలవు కాబట్టి 3వ తేదీ పెన్షన్లు ఇస్తామని తెలిపింది. తీరా ఇప్పుడు వలంటీర్లను ఎన్నికల సంఘం పక్కన పెట్టింది కాబట్టే పెన్షన్లు ఒకటో తేదీ ఇవ్వలేకపోయామని, దీనికి తెలుగుదేశం పార్టీనే కారణమని పెన్షనర్లను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. అయితే అధికార పార్టీ దుర్మార్గాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారు. అధికారం కోసం ఇంత నీచానికి దిగజారుతారా? అని ప్రశ్నిస్తున్నారు.

### జిల్లాలో 2,25,131 పెన్షన్లు

జిల్లాలో సామాజిక పెన్షన్లు 2,25,131 ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 1,31,793 వృద్ధాప్య పెన్షన్లే ఉన్నాయి. తర్వాత స్థానంలో వితంతు పెన్షన్లు 46,289, వికలాంగ పెన్షన్లు 27,109, అభయహస్తం పెన్షన్లు 5757 ఉన్నాయి. ఒంటరి మహిళలు 4468, చేనేత కార్మికులు 3828, డప్పు కళాకారులు 2992 కలుపుకుని 26 రకాల వర్గాలకు జిల్లాలో పెన్షన్లు అందుతున్నాయి. జిల్లాలో నెలకు రూ.67,31,43,500 కోట్లు పంపిణీ చేయాలి. అయితే సుమారు 99 శాతం పంపిణీ జరుగుతుంది. ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి, ఇతర సంక్షేమ పథకాలకు ప్రజలకు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అప్పుల మీదే ఆధారపడి ఉన్న విషయం తెలిసిందే. అప్పు దొరికితేనే ఇస్తారనే పరిస్థితి ఉంది. గత కొన్ని నెలలుగా పెన్షన్లను కూడా ప్రతినెలా ఒకటో తేదీ ఇవ్వడం లేదు. కొన్నిసార్లు మూడు, నాలుగవ తేదీకి ఇస్తున్నారు. అయితే ఈరోజు మాత్రం అధికార పార్టీ 3వ తేదీ వరకు పెన్షన్లు ఇవ్వలేదని ఇళ్ల పీకి పందిరేస్తోంది.

### సచివాలయాలకు చేరని డబ్బు..

ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటున్న వలంటీర్లు అధికార పార్టీకి కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయమని ఓటర్లను అడుగుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అధికార పార్టీ నాయకులు పట్టుచీరల వంటి కానుకలను వలంటీర్లను వెంట పెట్టుకుని మరీ పంపిణీ చేస్తున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఒక సంస్థ భారత ఎన్నికల సంఘానికి వలంటీర్ వ్యవస్థను అధికార పార్టీ ఏ విధంగా దుర్వినియోగం చేస్తోందో ఫిర్యాదు చేసింది. దీనిపైన స్పందించిన ఎన్నికల సంఘం వలంటర్లీను ఎన్నికల విధుల్లో జోక్యం చేసుకోనియవద్దని చెప్పడంతో పాటు పెన్షన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వీళ్ల ద్వారా ప్రజలకు అందజేయవద్దని ఆదేశాలు ఇచ్చింది. వలంటీర్లు తమకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్, సిమ్ కార్డు, ఛార్జర్, ప్రజల సమాచారం పుస్తకాలు, ఐరిష్ యంత్రాలను ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలోని వలంటీర్లు అందరూ తమ వద్ద ఉన్న పరికరాలను ప్రభుత్వానికి అప్పజెప్పారు. జిల్లాలో మొత్తం 8676 మంది వలంటీర్లు ఉన్నారు. అందులో ప్రస్తుతం 8528 మంది పనిచేస్తున్నారు. పెన్షన్ల పంపిణీ బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అప్పజెప్పమని ఎన్నికల సంఘం ఆదేశించింది. జిల్లాలో 501 సచివాలయాలు ఉన్నాయి. అందులో 5030 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రస్తుతానికి 4307 మంది పనిచేస్తున్నారు.

### ప్రతిపక్షాలపై విషం చిమ్మే కుట్ర

వలంటీర్లను విధులకు దూరంగా ఉంచడాన్ని తట్టుకోలేకపోయిన అధికార పార్టీ ఎలాగైనా ప్రతిపక్షంపై ప్రజల్లో వ్యతిరేక భావన ఏర్పడేలా చూడాలని కుట్రలు పన్నుతోంది. ఈ నేపథ్యంలోనే పెన్షన్లు 1వ తేదీ ఇవ్వలేకపోవడానికి తెలుగుదేశం పార్టీనే కారణమనే దుష్ప్రచారానికి తెరలేపింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇదే విషయాన్ని చెబుతుండటంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో పాటు కింది స్థాయి కార్యకర్తలు కూడా తెలుగుదేశం పార్టీపైన బురద చల్లుతున్నారు. బ్యాంకులకు వరుస దినాలు సెలవులు కావడంతో పాటు ఇంకా పెన్షన్ డబ్బును రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడాన్ని ఎక్కడా ప్రస్తావించడం లేదు. బుధవారం ఉదయమే సచివాలయాల వద్దకు వెళ్లాలని ప్రజలను తప్పుదోవ పట్టించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచే వృద్ధులు పెన్షన్ల కోసం వచ్చారు. అయితే ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతో అధికారులు పెన్షన్లు అందజేయలేకపోయారు. బ్యాంకు పనివేళలు మొదలు కావడంతో డబ్బు వచ్చిన చోట అధికారులు పెన్షన్ల పంపిణీ చేశారు. దాదాపుగా మధ్యాహ్నంపైనే ఈ పంపిణీ జరిగింది. అయితే అధికార పార్టీ నాయకుల మోసపు మాటలను నమ్మి సచివాలయాల వద్దకు వచ్చిన వృద్ధులు, వితంతువులు, మహిళలు ఎండకు అల్లాడిపోయారు. తాగడానికి నీళ్ల లేక, తినడానికి తిండి లేక ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల అధికారులు షామియానాలు, టెంట్లు ఏర్పాటు చేశారు. అయితే అధికార పార్టీ కుట్రను గుర్తించిన ప్రతిపక్షాలు తేరుకుని అధికార పార్టీ విషప్రచారానికి విరుగుడుగా వాస్తవాలను ప్రజలకు వివరించారు. ఒకటో తేదీనే ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు పెన్షన్లు ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. టీడీపీ మండల స్థాయిలో అధికారులకు ఈ మేరకు వినతిపత్రాలు ఇచ్చింది. దీంతో పెన్షన్ల పంపిణీలో అధికార పార్టీ ఆడుతున్న హైడ్రామా ఏంటో దాదాపు ప్రజలకు అర్థం అయింది.

### 48,148 మందికి పెన్షన్ పంపిణీ

కొన్ని మండలాల్లో మధ్యాహ్నం నుంచే సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ మొదలు పెట్టగా కొన్నిచోట్ల సాయంత్రం 4 గంటల సమయంలో మొదలైంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు 48,148 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఇందులో ఎక్కువగా రాజంపేట మునిసిపాలిటీలో 3342 మందికి గానూ 2286 మందికి 68.4 శాతం పంపిణీ చేశారు. పుల్లంపేటలో 5192 మందికి గానూ 3335 మందికి 64.23 మందికి పంపిణీ చేశారు. రాయచోటి మున్సిపాలిటీలో 8531 మందికి గానూ 5022 మందికి 58.87 శాతం పంపిణీ చేశారు. నందలూరులో 4158 మందికి గానూ 2344 మందికి 56.37 శాతం పంపిణీ చేశారు. ఇవే కాకుండా మరో 9 మండలాల్లో 49.92 శాతం నుంచి 27.24 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. కనిష్ఠంగా బి.కొత్తకోట మండలంలో 8057 మందికి గానూ కేవలం 6 మందికి మాత్రమే పెన్షన్లు పంపిణీ చేశారు. అధికార పార్టీ ఎటువంటి కుట్రలు చేయకుంటే గురువారం దాదాపుగా జిల్లా వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ పూర్తయ్యే అవకాశం ఉంది.

## జగన్ పర్యటన తెచ్చిన తంటా..

- ప్రాణాపాయ స్థితిలో ఓ వ్యక్తి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3: మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ పర్యటన తెచ్చిన తంటతో ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం సిద్ధిపేటకు చెందిన శంకర (50) తన కుమార్తె నివశిస్తున్న బి.కొత్తకోట మండలం తుమ్మనంగుంట గ్రామానికి మంగళవారం బయలుదేరాడు. కర్ణాటక నుంచి ములకలచెరువుకు బస్సు లో వచ్చిన శంకర అక్కడ సీఎం పర్యటనతో బస్సులన్నింటిని ఆపివేయడంతో అక్కడే మధ్యాహ్నం వరకు వేచి చూశాడు. ఇకచేసే దారి లేక తం బళ్లపల్లె మీదుగా తుమ్మనంకుంట వెళ్లాలని ప్రైవేటు వాహనంలో తంబళ్లపల్లెకు చేరుకున్నాడు. రాత్రి అయినా బస్సులు రాకపోవడంతో అక్కడే మద్యం తాగి తిరుగుతూ ఉండిపోయాడు. ఈ క్రమంలో రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం శంకరను ఢీకొని వెళ్లిపోయింది. రోడ్డుపక్కన పడిపోయి ఉన్న అతడిని రాత్రి 10 గంటల సమయంలో గస్తీ తిరుగుతున్న పోలీసులు చూసి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబీకులు వచ్చి మెరుగైన చికిత్స కోసం బుధవారం ఉదయం తిరుపతికి తీసుకెళ్లారు.

## వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో..

### పింఛన్ కోసం వెళుతూ వృద్ధురాలు మృతి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 3: వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వృద్ధులు, దివ్యాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అయితే టీడీపీ వారి వళ్ల పింఛన్లు ఆగిపోయాయని, మరో రెండు నెలల్లో జగనన్న ప్రభుత్వం రాగానే వలంటీర్లు మళ్లీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇస్తారని వైసీపీ దుష్ప్రచారం చేసింది. దీనికి తగ్గట్టు పింఛన్ల పంపిణీకి డబ్బును 31వ తేదీ కాకుండా 3వ తేదీ వేసింది. దీంతో తమకు పింఛన్ వస్తుందో రాదో అనే ఆందోళన చాలామంది వృద్ధుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లికి చెందిన రాజమ్మ (80) బుధవారం సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో సచివాలయంలో పింఛన్ తీసుకొనేందుకు వెళుతుండగా ఎండ కారణంగా మార్గమధ్యంలో కళ్లు తిరిగి పడిపోయారు. దీంతో అక్కడ ఉన్న గ్రామస్తులు గమనించి ఆమెను ఇంటి వద్దకు తీసుకుపోయారు. అప్పటికే ఆమె చనిపోయారు. రాజమ్మ పింఛన్ కోసం వెళుతూ కిందపడిపోయారని సమాచారం రావడంతో అర్ధగంటలో సచివాలయంలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్ ఆమె ఇంటికి వెళ్లారు. రాజమ్మ చనిపోయిన విషయాన్ని కుటుంబసభ్యులు దాచిపెట్టడంతో వెంకటేశ్ ఆమె వద్ద నుంచి వేలిముద్ర తీసుకుని పింఛన్ సొమ్ము అందించారు. విషయం తెలుసుకున్న కార్యదర్శి మారెప్ప అక్కడకు చేరుకుని కుటుంబసభ్యుల వద్ద నుంచి పూర్తి వివరాలు సేకరించి ఎంపీడీవోకు సమాచారం చేరవేశానన్నారు.



మృతి చెందిన వృద్ధురాలు రాజమ్మ

## వైసీపీకి మద్దతుగా వలంటీర్ పోస్టు

గుర్రంకొండ, ఏప్రిల్ 3: గుర్రంకొండ పట్టణానికి చెందిన ఓ వలంటీర్ వైసీపీ మద్దతుగా పంపిన పోస్ట్ వలంటీర్ గ్రూప్‌లో చక్కర్లు కొడుతోంది. ఎన్నికల కోడ్ ఉన్నందున్న పింఛన్ల పంపిణీకి వలంటీర్లను ప్రభుత్వం దూరంగా ఉంచింది. ఈ క్రమంలో ఓ వలంటీర్ టీడీపీ చేసిన ఫిర్యాదుతోనే పింఛన్లను ఇళ్ల వద్దకు ఇవ్వకుండా చేసిందని వలంటీర్ గ్రూప్‌లో పోస్టు చేసింది. ఈ మెసేజ్‌ను వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించింది. మరో రెండు నెలల్లో వైసీపీ ప్రభుత్వ వస్తుందని తిరిగి ఇళ్ల వద్దనే పింఛన్లను ఇస్తామని చెప్పాలంటూ పంపిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి వుంది.



వలంటీర్ పంపిన పోస్టు

## సిద్ధం సభకు వలంటీర్

గుర్రంకొండ, ఏప్రిల్ 3: మదనపల్లెలో జరిగిన మేమంతా సిద్ధం సభకు గుర్రంకొండ మండలం సరిమడుగు సచివాలయంలో పని చేస్తున్న వలంటీర్ ప్రేమ్ వెళ్లాడు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న వలంటీర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొకూడదని నిబంధనలున్నాయి. అందుకు విభిన్నంగా సరిమడుగుకు చెందిన వలంటీర్ ప్రేమ్ వైసీపీ కండువాను తలకు చుట్టుకుని వెళ్లిన ఫొటో వైరల్ అవుతోంది.



మదనపల్లెలో జరిగిన మేమంతా సిద్ధం సభకు వెళ్లిన వలంటీర్

ములకలచెరువు బస్టాండు సర్కిల్ వద్ద అశేష జనవాహినినుద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు (ఫైల్)



మంగళవారం జరిగిన రోడ్‌షోలో ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లో బస్సు దిగని సీఎం జగన్



# నక్కకు.. నాగలోకానికి..

- ములకలచెరువు సాక్షిగా బయటపడ్డ చంద్రబాబు, జగన్‌కు ఉన్న తేడా
- నాడు చంద్రబాబుకు జన నీరాజనం
- నేడు జగన్‌కు జనం కరువు
- నాడు ప్రజలనుద్దేశించి ప్రసంగించిన చంద్రబాబు
- నేడు బస్సు దిగని సీఎం జగన్
- సీఎం జగన్ తీరుపై ప్రజల తీవ్ర అసంతృప్తి

## ● ఇద్దరి మధ్య ఇంత తేడా?

ములకలచెరువు, ఏప్రిల్ 3: వామ్మో ఇద్దరు అగ్రనేతల మధ్య ఇంత తేడా ఉందా. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిల మధ్య ఉన్న తేడా ములకలచెరువు సాక్షిగా బయటపడింది. గత ఏడాది ఆగస్టు నెలలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వైసీపీ పాలనలో జరిగిన ప్రాజెక్టుల విధ్వంసంపై..ప్రాజెక్టుల సందర్శనకు అన్నమయ్య జిల్లా పర్యటనకు వచ్చారు. అప్పుడు శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లా సరిహద్దులోని కొక్కంటి క్రాస్‌లోని కల్యాణమండపం వద్ద గత ఏడాది ఆగస్టు 3వ తేదీ చంద్రబాబు రాత్రి బస చేశారు. అక్కడి నుంచి మరుసటి రోజు ఆగస్టు 4వ తేదీ ములకలచెరువు మీదుగా నాయనివారిపల్లె వద్ద హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల అనుసంధాన ఎత్తిపోతల పథకం సందర్శనకు బయలుదేరారు. ఈ క్రమంలో ములకలచెరువులో చంద్రబాబును చూసేందుకు భారీగా జనం తరలివచ్చారు. రోడ్డు పొడవునా నిలబడి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. దీంతో చంద్రబాబు ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి సుమారు ఐదు కిలోమీటర్లు ప్రజలను చూస్తూ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లో భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి అరగంటకు పైగా ప్రసంగించారు. చంద్రబాబు ప్రసంగం టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ములకలచెరువులో రోడ్‌షో గానీ, పర్యటన గానీ లేకపోయినా రోడ్డు మార్గాన వెళ్తూ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో మంగళవారం మేమంతా సిద్ధం పేరుతో ములకలచెరువులో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన దీనికి భిన్నంగా సాగింది. శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లా సరిహద్దులోని రాత్రి విడిది కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు జగన్ ములకలచెరువులోకి ప్రవేశించారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో సీఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన వైసీపీ శ్రేణులు, చూసేందుకు వచ్చిన ప్రజలకు తీవ్ర నిరాశకు గురి చేశారు. జిల్లా సరిహద్దు నుంచి షాదీమహల్, బస్టాండు సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, పెట్రోల్ బంకు వరకు ములకలచెరువులో బస్సు యాత్ర సాగింది. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు జగన్ బస్సులోనే ఉండిపోయారు. నమస్కారాలు, అభివాదంతో సరిపెట్టారు. ములకలచెరువులో ఎక్కడా కూడా బస్సు దిగడం గానీ బస్సుపైకి ఎక్కింది గానీ చేయలేదు. బస్సులోనే ఉన్న జగన్ ఎవరికీ సరిగా కన్పించలేదు. దీంతో జగన్‌ను చూసేందుకు మండుటెండలో వచ్చిన జనం తీవ్ర అసంతృప్తితో వెనుదిరిగారు. ఇక వైసీపీ శ్రేణుల బాధ వర్ణణాతీతంగా మారింది. ములకలచెరువులో ఘన స్వాగతం పలికేందుకు వచ్చిన వైసీపీ శ్రేణులకు నిరాశ ఎదురైంది. ఓ నాయకుడు భారీ క్రేన్ సహాయంతో పూలమాల వేసేందుకు ప్రయత్నించగా దానిని చూసి కూడా జగన్ బస్సుపైకి ఎక్కకుండా ముందుకు సాగారు. దీంతో ఆ నాయకుడు నిరాశ చెందాడు. భారీ క్రేన్ దానికి ఉన్న పూలహారం రోజంతా ఎండలో ఎండింది. ఏడు నెలల వ్యవధిలో చంద్రబాబు, జగన్ ఇద్దరూ ములకలచెరువులో పర్యటించారు. అయితే చంద్రబాబు ప్రజలనుద్దేశించి ప్రసంగించడం, జగన్ ప్రజలను పట్టించుకోకుండా బస్సులో నుంచి బయటకు రాకపోవడం చర్చనీయాశమైంది. చంద్రబాబు, జగన్ వ్యవహార శైలిలో ఉన్న తేడా ములకలచెరువు పర్యటనతో అర్థమవుతోందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. చంద్రబాబుకు ప్రజల మీద గౌరవం, అభిమానం ఉందని.. జగన్‌కు అవేమి లేవని అంటున్నారు.

### రాత్రికి రాత్రే ఫ్లెక్సీలు.. జెండాలు తొలగింపు

ములకలచెరువులో సీఎం జగన్ పర్యటన సందర్భంగా రోడ్డు కిరువైపులా ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలు, జెండాలను మంగళవారం రాత్రి తొలగించారు. ఎన్నికల కోడ్‌ను పట్టించుకోకుండా ములకలచెరువులో రోడ్డుకిరువైపులా విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు, జెండాలు కట్టారు. ఇళ్లు, దుకాణదారుల ప్రమేయం లేకుండా ముందు, పైన ఏర్పాటు చేసిన జెండాలు తీసేశారు ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ ఉప కార్యనిర్వహణ ఇంజనీరు వారి కార్యాలయం ముందు, ఇండియన్ బ్యాంకు మీద కట్టిన మేమంతా సిద్ధం జెండాలు తొలగించారు. ఇదంతా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని భావించి ఫ్లెక్సీలు, జెండాలు రాత్రికి రాత్రే తొలగించారని స్థానికులు చెబుతున్నారు.

## బాలసుబ్రమణ్యంతో టీడీపీ నేతలు భేటీ



రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న రాజంపేట టీడీపీ నేతలు

రాజంపేట, ఏప్రిల్ 3: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో బుధవారం రాత్రి రాయచోటిలోని ఆయన స్వగృహంలో రాజంపేట టీడీపీ నేతలు భేటీ అయ్యారు. రాజంపేట మండలం భువనగిరిపల్లె టీడీపీ నాయకులు నరసింహ, రాజంపేట పట్టణ మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, ఊటుకూరు టీడీపీ నాయకులు చెంగల్‌రాయుడు, వెంకటరాజంపేట నాయకులు చంద్ర, మన్నూరు టీడీపీ నాయకులు, హత్యరాల దేవస్థాన మాజీ చైర్మన్ బండారు బాలయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటస్వామి, అగ్రహారం టీడీపీ నాయకులు సుధాకర్, శ్రీనివాసరాజు తదితరులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యంను శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని తెలిపారు.

## వైసీపీ రాజకీయానికి చెక్ పెడతా

● రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 3: కూటమి ప్రణాళికతో వైసీపీ రాజకీయానికి చెక్ పెడతానని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కూటమి ఆత్మీయ సమావేశం చిట్వేలి రూటులో ఉన్న విజయకన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో భారీ ఎత్తున చేరికలు ఉంటాయన్నారు. రైల్వేకోడూరులో కూటమి అభ్యర్థిని అందరి సహకారంతో గెలపించుకుని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నరేంద్రమోదీలకు బహుమతిగా ఇస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా ఈ ఎన్నికల్లో పని చేస్తారన్నారు.

## ఇండియా కూటమిని గెలిపించుకుందాం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 3: ఇండియా కూటమిని గెలిపించుకుంటే రాష్ట్రాన్నే కాకుండా దేశాన్ని కూడా కాపాడుకోవచ్చని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోశాలదేవి తెలిపారు. బుధవారం సీపీఐ ఏరియా కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి పండుగోల మణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీలో సామాన్యులు జీవించలేని స్థితి ఏర్పడిందని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. దేశ వ్యాప్తంగా మార్పు కోసం ఇండియా కూటమి కంకణం కట్టుకుని సీపీఐ, సీపీఎం పార్టీలను కూటమిగా ఎన్నికల బరిలోకి దించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్, సీపీఐ ఓబులవారిపల్లె మండల కార్యదర్శి నాగమ్మ, డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ కార్యదర్శి మోడి శివయ్య, సీపీఐ మండల నాయకులు డి.ప్రతాప్‌రెడ్డి, కటారి గోపాల్, చిట్వేలి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిట్వేలి, ఏప్రిల్ 3: ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని ఎంఈఓ కోదండ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులతో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పాఠశాల నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆదర్శవంతమైన ప్రజాస్వామ్యాన్ని ఓటు హక్కుతో సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు, ఏబీఎన్ ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘించిన వలంటీర్ తొలగింపు

● ఎంపీడీవో అమర్‌నాథ్

సుండుపల్లె, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మదనపల్లె మండలం గుండ్లపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో వలంటీర్ గణేశ్‌ను విధుల నుంచి బుధవారం తొలగించినట్లు ఎంపీడీవో అమర్‌నాథ్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించి మంగళవారం మదనపల్లెలో జరిగిన సిద్ధం సభకు తాను వెళ్లడంతో పాటు పలువురిని తీసుకెళ్లడంతో అతనిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారాలకు, సభలకు వెళ్లకూడదని ఆయన తెలియజేశారు. అలాగే ప్రభుత్వం అందించిన చరవాణిలు ఇంకా ఇవ్వనివారు తిరిగి సచివాలయాల్లో అందజేయాలన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు

రాజంపేట, ఏప్రిల్ 3: రాజంపేట మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సీజీఆర్ ట్యాలెంట్ మీట్-2024 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల యోగివేమన యూనివర్సిటీ డాక్టర్ వి.జయరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తుకు కావాల్సిన ఎన్నో ఆవిష్కరణలు రూపొందించవచ్చని తెలిపారు. కళాశాల వ్యవస్థాపకుడు గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయరామిరెడ్డిని కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ, డీన్ ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# పండుటాకుల అవస్థలు

● పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారం ● ఉదయాన్నే సచివాలయాలకు చేరుకున్న పింఛనుదారులు





పెనగలూరు సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచిచూస్తున్న పెన్షనర్లు, ఒంటిమిట్ట సచివాలయంలో పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు

పెనగలూరు/ఒంటిమిట్ట/రైల్వేకోడూరు, ఏప్రిల్ 3: వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్లే తమకు పింఛన్లు ఆలస్యంగా వచ్చాయని పండుటాకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో పాటు ప్రభుత్వం నుంచి సామాజిక పెన్షన్లు పొందుతున్న వర్గాలు ఎండలో ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచే పెన్షనర్లు సచివాలయాల వద్ద పడిగాపులు కాసి ఉసూరుమన్నారు. కొన్నిచోట్ల సాయంత్రం క్యూలైన్లలో నిల్చోబెట్టి ఇవ్వగా, మరికొన్ని చోట్ల ఇంకా డబ్బులు రాలేదని వెనక్కు పంపారు. కాగా వైసీపీ ప్రభుత్వం మాత్రం... టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కక్ష కట్టి వలంటీర్లను పంపిణీ చేయకుండా చేసిందని, దీంతో ఇంటి వద్దకు పెన్షన్లు తెచ్చి ఇవ్వలేకపోయామని హైడ్రామాకు తెరలేపింది.

పెనగలూరు మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. గ్రామ కార్యదర్శులు బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసుకునేందుకు మధ్యాహ్నం వరకు సమయం పట్టడంతో పింఛన్‌దారులు సచివాలయాల వద్ద ఎదురు చూడాల్సి వచ్చింది. సచివాలయాల వద్ద కనీసం షామియానా కూడా వేయకపోవడంతో నిలువ నీడలేక ఆకలిదప్పులతో పింఛన్‌దారులు తల్లడిల్లిపోయారు. నాలుగు గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఒంటిమిట్ట మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల్లో ఆలస్యంగా పంపిణీ చేశారు. లబ్ధిదారులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి పంపి ణీ చేపట్టారు. మండల వ్యాప్తంగా 4329 మంది లబ్ధిదారులుండగా సాయంత్రం ఏడు గంటల వరకు 60 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు.

రైల్వేకోడూరు మండలంలోని గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులు పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులు పడినట్లు తెలిసింది.

## టీడీపీతో రాష్ట్రాన్ని కాపాడుకుందాం

● మాసాపేటలో ఎన్నికల ప్రచారంలో సుగవాసి, మండిపల్లి పిలుపు



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాద్‌బాబు, రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలు, కబ్జాలు, మద్యం, డ్రగ్స్ మాఫియాలు, దౌర్జన్యాలతో భ్రష్టు పట్టిపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం వారు రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి మాసాపేటకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు బాణాసంచా పేలుస్తూ పెద్ద ఎత్తున స్వాగతం పలికి గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాసాపేటలో ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ అరాచకాలు వివరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించి రాయచోటి, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యంతో పాటు రాజంపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీని ఇంటికి సాగనంపడానికి సిద్దంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దర్బార్‌బాషా, టీడీపీ నేతలు ముగ్గుల బాషా, సుగవాసి విద్యాధర్, సుగవాసి శ్రీనివాసులు, జానకీరామ్, సుగవాసి సుధాకర్, కొట్టే శ్రీనివాసులు, కోలా నాగరాజా, కోదండ, బోనంశెట్టి తిమ్మయ్య, కేసీ ప్రసాద్, మేకల భీమయ్య, తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందులో మండిపల్లి

పట్టణంలోని కుమ్మరమిట్టలో గల లాల్ మసీదు వద్ద ముస్లిం మైనార్టీలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి వచ్చిన ముస్లిం మైనార్టీలను ఆప్యాయంగా పలకరిస్తూ భోజనం వడ్డించారు. అనంతరం వారితో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు టీడీపీకి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్‌బాషా, పారిశ్రామికవేత్త శ్రీనివాసులరెడ్డి, జాఫర్‌అలీఖాన్, అహ్మద్ తదితర మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: విశ్వనాథనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

పుల్లంపేట, ఏప్రిల్ 3: రైల్వేకోడూరు నియోజకవర్గానికి అసెంబ్లీ అభ్యర్థిగా కూటమి తరపున యనమల భాస్కర్‌రావును ప్రకటించారని, ప్రతిఒక్కరూ కూటమి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని రైల్వేకోడూరు మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాధనాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం రామక్కపల్లెలోని పోతినేని గార్డెన్స్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అభ్యర్థి యనమల భాస్కర్‌రావు గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేన నాయకుడు పీవీఎస్ మూర్తి మాట్లాడుతూ క్యాండెట్ మారుస్తారని అపోహలు ఉన్నాయని, క్యాండెట్ మార్పు జరగదని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ క్యాండెట్‌ను నిర్ణయించడం జరిగిందన్నారు. జనసేన అభ్యర్థి యనమల భాస్కర్‌రావు మాట్లాడుతూ తన గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం వచ్చేలా కష్టపడి పనిచేసి రైల్వేకోడూరును అన్ని విధాలా అభివృద్ధి పరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఆరే సుధాకర్‌నాయుడు, విశ్వేశ్వరనాయుడు, కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, కె.వి.ఎస్.యాదవ్, లింగుట్ల వెంకటరమణ, పోలూరు కృష్ణమనాయుడు, పెంచలయ్య, నాగినేని వెంకటసుబ్బానాయుడు, చిన్నం శివయ్య, సంజయ్‌గాంధీ, కేసినేని నారాయణనాయుడు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## నీలకంఠ్రావుపేటలో తాగునీటి సమస్య



నీలకంఠ్రావుపేటలో సొంత ఖర్చులతో ట్యాంకుల ద్వారా నీటిని తీసుకుంటున్న గ్రామస్తులు

రామాపురం, ఏప్రిల్ 3: మండలంలోని నీలకంఠ్రావుపేటలో గత నెల రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు, ఆ గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. గ్రామంలో 4 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయని, అందులో నీరు అడుగంటిపోవడంతో గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 600 కుటుంబాల వారు జీవిస్తున్నారని, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో పశువులు, బర్రెలు, గొర్రెలు, మేకలు ఉండడంతో వాటికి తాగునీరు ఇవ్వలేకపోతున్నామని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో తాగునీటి కోసం డబ్బులు పెట్టి సొంతంగా ట్యాంకుల ద్వారా నీటిని తోలించుకుంటున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోలేదని వారు తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని గ్రామానికి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు.

## ప్రైవేటు కళాశాల అనుమతులు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

రాజంపేటటౌన్, ఏప్రిల్ 3: రాజంపేట పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి ప్రైవేటు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని కనీస వసతులు కూడా లేకుండా ధనమే ధ్యేయంగా పనిచేస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహులు తెలిపారు. బుధవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజంపేట పట్టణంలో చిన్నపాటి గదులలో ప్రైమరీ స్కూళ్లలో చిన్నారులను ఉంచి బోధనలు జరుపుతున్నారన్నారు. వేసవి కాలం కావడంతో అధిక వేడితో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటుస్కూళ్ల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు దండుకుంటున్నారే తప్ప కనీస వసతులు గాలికి వదిలేశారన్నారు. కావున వారికి తగినట్లు ఏసీ గదులను ఏర్పాటు చేయడం అత్యవసరమన్నారు. జిల్లా, స్థానిక విద్యాశాఖాధికారులు ప్రైమరీ స్కూల్ యాజమాన్యంపై దృష్టి సారించకపోవడంతో విచ్చలవిడిగా విద్యాలయాలు, వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థుల సౌకర్యార్థం ప్రైవేటు యాజమాన్యాలు ఆలోచించాలని విద్యాశాఖాధికారులు అలాంటి పాఠశాలల విషయాల్లో దృష్టి సారించాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలలపై విద్యాశాఖాధికారులు కఠిన చర్యలు తీసుకొని పాఠశాలల అనుమతులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు బి.తేజ, కె.బాబు, కె.సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి ఆటో బోల్తా

● తప్పిన పెను ప్రమాదం

సిద్దవటం, ఏప్రిల్ 3: మండలంలోని బద్వేలు రహదారి భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద బుధవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ కూడా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## నేడు ఒంటిమిట్టలో నడివీధి గంగమ్మ జాతర

ఒంటిమిట్ట, ఏప్రిల్ 3: మండల కేంద్రంలోని ఒంటిమిట్టలో నడివీధి గంగమ్మ జాతరను గురువారం వైభవంగా నిర్వహించనున్నారు. వేకువజామున అమ్మవారిని గ్రామ ఆచారం ప్రకారం గ్రామంలోని ఆచారాలను గ్రామస్తులు సత్కరించిన అనంతరం అమ్మవారిని ఆచారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని ప్రతిష్ఠించి వారి స్వగృహం నుంచి పురవీధుల గుండా నడివీధి గంగమ్మ గుడి వద్దకు తీసుకురానున్నారు. జాతర పురస్కరించుకొని గ్రామం మొత్తం ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. భక్తులు వేకువజామున అమ్మవారికి పెద్దఎత్తున జంతు బలిదానాలు, కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

## ఓటింగ్ శాతాన్ని పెంచాలి: ఆర్డీవో



ఆదర్శ పోలింగ్‌స్టేషన్లు పరిశీలిస్తున్న ఆర్డీవో

నందలూరు, ఏప్రిల్ 3: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆయన నందలూరు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భవతుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి వెయిటింగ్ రూమ్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల కోసం షామియానా, నీరు, ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మహబూబ్‌బాషా, స్వీప్ మోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దారు జ్యోతి, సర్వేయర్ ఓబయ్య, వీఆర్వోలు చంద్రశేఖర్‌రాజు, గంగాధర్, వెంకటరమణ, శివప్రసాద్, లక్ష్మయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే అన్నివర్గాల వారికి సమన్యాయం



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఏప్రిల్ 3: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని ఎగువగొట్టివీడు పంచాయతీలో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని, టీడీపీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చెందుతాయని కొనియాడారు. రాంప్రసాద్‌రెడ్డిని గెలిపిస్తే గాలివీడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్‌రియాజ్, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు చెన్నయ్య, మల్లికార్జున, ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ




సుండుపల్లెలో వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

సుండుపల్లె, ఏప్రిల్ 3: ఎన్నికల విధుల్లో భాగంగా బుధవారం స్పెషల్ స్క్వాడ్ అధికారులు మండల కేంద్రంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రమైన సుండుపల్లె, బస్టాండు మూడురోడ్ల కూడలితో పాటు పలు ప్రాంతాల్లో ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. వాహనాలు ఆపి తనిఖీ చేయడంతో పాటు పెద్దపల్లి రోడ్డులో తనిఖీలు, బైరాగిగుట్ట, సానిపాయిరోడ్డు ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటించారు. ఈ తనిఖీల్లో సుండుపల్లె ఈవోపీఆర్డీ సురేశ్‌బాషా, ఎస్ఐ కేవీ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

**నందలూరు:** కడప-చెన్నై జాతీయ ప్రధాన రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం సమీపంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, పోలీసులు మహేంద్ర, కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

## లోకేశ్‌తో జగన్‌మోహన్‌రాజు భేటీ



లోకేశ్‌తో భేటీ అయిన జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఏప్రిల్ 3: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో రాజంపేట టీడీపీ నాయకుడు జగన్‌మోహన్‌రాజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ అభ్యర్థులు, పార్లమెంటు అభ్యర్థి విజయావకాశాలపై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేసి రాజంపేటలోని అన్ని స్థానాల్లో అధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి కృషి చేయాలని లోకేష్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై సమాలోచనలు నిర్వహించారు.

## కన్నుల పండువగా ఉయ్యాలసేవ

చిట్వేలి, ఏప్రిల్ 3: మండల పరిధిలోని నగిరిపాడు రంగనాయకుల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు ప్రత్యేక పూజలు, అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం జెట్టివారిపల్లె గ్రామస్తులచే పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. మధ్యాహ్నం మల్లెపల్లి హరిజనవాడకు చెందిన గొల్ల నరసింహులు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి జెట్టివారిపల్లె గ్రామస్తులు తుంగా సుబ్బారామయ్య, భార్య నారాయణమ్మ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు ఉయ్యాలసేవ నయనానందకరంగా నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామ పెద్దలు ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## కె.సుగుమంచిపల్లె వద్ద రూ.10 లక్షల నగదు సీజ్

కొండాపురం, ఏప్రిల్ 3 : మండలంలోని జిల్లా సరిహద్దుల్లోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం పోలీసులు రూ.10 లక్షల నగదును సీజ్ చేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. అనంతపురం నుంచి ప్రొద్దుటూరుకు కారులో శ్రీదేవి అనే మహిళ వెళుతుండగా ఆమె నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రాయచోటిలో రూ.4 లక్షలు...

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి అర్బన్ పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా ఎటువంటి ఆధారాలు లేని రూ.4 లక్షల నగదును సీజ్ చేశారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాల్లోకి వెళితే.. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో రెడ్డిశేఖర్‌రాజు అనే వ్యక్తి ఎటువంటి రసీదులు లేని రూ.4 లక్షలు నగదు ద్విచక్రవాహనంపై తీసుకెళుతుండగా నగదును సీజ్ చేసి విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెలియజేయడంతో పాటు సదరు నగదును ట్రెజరీలో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు.

## తాళ్లపాకలో ఇంట్లోకి వచ్చిన దుప్పి



రాజంపేటటౌన్, ఏప్రిల్ 3: రాజంపేట మండల పరిధిలోని అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో అడవి దుప్పి ప్రత్యక్షమైంది. ఆ జింకను గ్రామంలోని కుక్కలు వెంట పడటంతో గ్రామంలోని జవ్వాజి శివయ్య ఇంటిలోకి వచ్చింది. దీంతో స్థానికులు దానిని అతికష్టంపై బంధించి వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. కుక్కల దాడిలో దుప్పికి గాయాలు ఉండటంతో దుప్పికి వైద్య చికిత్సలు చేసి అనంతరం అడవిలోకి వదిలిపెడతామని అటవీ శాఖాధికారులు తెలిపారు.

## గండి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

చక్రాయపేట, ఏప్రిల్ 3: గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. బుధవారం యర్రగుంట్ల పట్టణానికి చెందిన తుంగా వెంకటరామిరెడ్డి (రైల్వే కాంట్రాక్టర్), ఆయన సతీమణి అమృతలక్ష్మి ఈ విరాళం అందించారన్నారు. వీరికి ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌లు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


కాశినాయన ఏప్రిల్ 3: మండలంలోని అక్కంపేట గ్రామం వద్ద బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 5 ఎకరాల అరటితోట కాలిపోయినట్లు గ్రామస్థులు, బాధిత రైతులు మురుకూటి శ్రీనివాసుల రెడ్డి, మురుకూటి గురివిరెడ్డి (బంగారు గుర్విరెడ్డి) తెలిపారు. బాధి త కుటుంబాల వివరాల మేరకు మధ్యాహ్న సమయంలో కరెంట్ లైన్ పైనుంచి అగ్గిరవ్వలు పడి మంటలు అంటుకున్నాయన్నారు. గుర్తించిన వెంటనే పోరుమామిళ్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలు పక్కతోటలకు వ్యాపించకుండా ఆర్పివేశారన్నారు. ప్రమాదంలో కటింగ్‌కు వచ్చిన 5 ఎకరాల్లోని అరటి గెలలు, డ్రిప్ పైపులు వ్యవసాయ మోటారు వైర్లు, పైపులు పూర్తిగా కాలిపోయాయన్నారు. దాదాపు రూ.5 లక్షల నష్టం ఏర్పడిందని బాధిత రైతులు తెలిపారు.

## ముగిసిన ఇంటర్ మూల్యాంకనం


మాట్లాడుతున్న ఆర్ఐవో వెంకటసుబ్బయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: కడప నగరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ మూల్యాంకన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్ఐవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కడప జిల్లాకు లక్షా 84 వేల 907 జవాబుపత్రాలు మూల్యాంకనానికి వచ్చాయన్నారు. వాటిని అధికారులు, ప్రిన్సిపాల్, జూనియర్ లెక్చరర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా సుబ్బరాయుడు


నియామకపత్రం అందిస్తున్న వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3 : వైవీయూ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్ లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ప్రొఫెసరు వై.సుబ్బరాయుడును నియమిస్తూ వైస్ చాన్సలర్ సుధాకర్ నియామకపత్రం తన చాంబరులో అందించారు. ఇది వరకు డీన్‌గా ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసరు శ్రీనివాస్ పదవీ కాలం పూర్తి కావడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతన డీన్‌గా నియమితులైన ప్రొఫెసరు సుబ్బరాయుడు మూడేళ్లపాటు ఈ బాధ్యతలో కొనసాగుతారు. అకడమిక్ పరిశోధనల పరంగా ఆయా విభాగాల అభివృద్ధికి కృషి చేయాలని వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య సూచించారు.

## హెడెక్స్ కోర్సులో నమోదుకు విశేష స్పందన


విద్యార్థులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: వైవీయూలో హెడెక్స్ అందించే కోర్సుల్లో నమోదు కేంద్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి సందర్శించారు. ఈ కోర్సులో 400 మంది ఫ్యాకల్టీ విద్యార్థుల వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కోర్సులో చేరడం ద్వారా ప్రపంచంలో ప్రముఖ యూనివర్శిటీల ఫ్యాకల్టీల లెక్చర్స్ వీడియోస్ చూడడంతో పాటు మెటీరియల్స్‌ను విద్యార్థులు ఉచితంగా పొంది వాటిని సాధన చేయాలన్నారు. తద్వారా ప్రపంచస్థాయి జ్ఞానాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెడెక్స్ ప్రోగ్రాం కోర్సు ఛాంపియన్ కె.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రెడ్డెయ్య పాల్గొన్నారు.

## రైలుకింద పడి యువకుడు మృతి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 3: నగర పంచాయతీ పరిధిలోని చెరువుకట్ట వద్ద మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని యువకుడు రైలుకింద పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

## గుర్తుతెలియని శవం లభ్యం



చక్రాయపేట, ఏప్రిల్ 3: మండలంలోని నాగులగుట్టపల్లె వద్ద గుర్తుతెలియని మగశవం లభ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో మొలతాడు దారాలు అమ్ముకుంటూ ఉండి బుధవారం నాగులగుట్టపల్లె వద్ద చనిపోయి ఉన్నాడన్నారు. మృతుడి ఎడమచేతిపై ఎం.రాణి అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిస్తే చక్రాయపేట ఎస్ఐ 9121100557 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

# నిషా కోసం తప్పటడుగులు

- విచ్చలవిడిగా సాల్యూషన్, మాత్రలు, ఇంజక్షన్ల వినియోగం
- కొరవడిన సంబంధిత అధికారుల నిఘా
- తల్లిదండ్రులు గమనించకపోతే పిల్లల జీవితాలు బుగ్గిపాలే



కడపలో యువత మత్తుకు చిత్తై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువ శాతం 13 నుంచి 23 సంవత్సరాల పిల్లలే దీని పట్ల ఆకర్షితులై తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారు. గంజాయి మత్తు దాటి సాల్యూషన్, మాత్రలు, ఇంజక్షన్లు తీసుకునే స్థాయికి వచ్చారు. మత్తు పదార్థాలు కొనడానికి డబ్బులు లేకపోవడంతో కొంత మంది చోరీల బాట పడితే మరికొందరు గొడవలకు పాల్పడుతున్నారు.




కడప (క్రైం), ఏప్రిల్ 3: కొందరు మైనర్లు, యువత జులాయిగా తిరుగుతూ చెడు స్నేహాలతో మత్తుకు అలవాటు పడుతున్నారు. మొదట సిగరెట్లతో ప్రారంభించి, తరువాత గంజాయి, ఆ తరువాత ఇంకా మత్తు ఎక్కేందుకు మాత్రలు, ఇంజక్షన్లకు అలవాటుపడి మత్తుకు బానిస అవుతున్నారు. కడప నగరంలో కొంత మంది యువత జన సంచారం లేని ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఈ ప్రయోగాలు చేస్తూ వారి ఆయుష్షును చేజేతులా తగ్గించుకుంటున్నారు. గంజాయి మత్తు చాలకపోవడంతో మత్తు ఇచ్చే కొన్ని రకాల మాత్రలు, ఇంజక్షన్లు డాక్టర్లు ఇచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ ఏజన్సీల నుంచి తెచ్చుకుని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

### ఎదిగే పిల్లలను పట్టించుకోని తల్లిదండ్రులు

పెరిగే పిల్లల పట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. పగలు రాత్రి తేడా లేకుండా వారు ఎక్కడ తిరిగినా, ఎన్ని గంటలకు ఇంటికి వచ్చినా ప్రశ్నించడం లేదు. వారిపై నిఘా ఉంచడంలేదు. ఇలాంటి పిల్లల్లో కొందరు మత్తు పదార్థాల బారినపడుతున్నారు. గతంలో గంజాయి, గుట్కాలు, మద్యం, స్టైరాయిడ్స్ లాంటి మత్తు పదార్థాలను వినియోగించేవారు. చాలా మంది యువకులు మత్తు ఎక్కువగా ఎక్కడానికి కొన్ని రకాల టానిక్‌లు, సర్జికల్స్ స్పిరిట్స్, కొన్ని రకాల మాత్రలు.. వైద్యుల పర్యవేక్షణలో వినియోగించే కొన్ని రకాల మత్తు ఇంజక్షన్లు వాడుతున్నారు. కొందరు ఫెవికిక్, శానిటైజరును కూడా మత్తు కోసం వాడుతున్నట్లు సమాచారం. పిల్లల పట్ల తల్లిదండ్రులే బాధ్యత తీసుకుని వారిపై నిరంతరం నిఘా ఉంచకపోతే చేజేతులా వారి జీవితాలను నాశనం చేసిన వారవుతారు. జిల్లాలో ప్రస్తుతం చాలా చోట్ల రహదారుల వెంట, తుప్పలు, బస్టాండ్ల వద్ద చెత్తకుప్పల్లో మత్తు కోసం వినియోగించే ఇంక్షన్లు, మాత్రలు ఇతర ప్రత్యామ్నాయ పదార్థాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. వీటిలో చాలా పదార్థాలు నిత్యం ప్రజలకు ఏదో ఒక పనికి వినియోగించేవే కావడం విశేషం.

### మత్తుకు యువత చిత్తు

యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే చాలించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించకపోతే వారి భవిష్యత్తు అంధకారబంధురం అయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా వీటి వినియోగంపై నిఘా పెట్టి నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

### రూ.100 మాత్రలు రూ.1200లకు విక్రయాలు

డాక్టరు అనుమతి లేకుండా కొంతమంది ఏజంట్లు వంద రూపాయల విలువ చేసే మత్తు ట్యాబ్లెట్లను రూ.1200కు పైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మత్తు ఎక్కించే మాత్రలు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకూడదనే నిబంధన ఉన్నప్పటికీ కొంత మంది ఈ మాత్రలు విచ్చలవిడిగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### కడపలో మత్తు బ్యాచ్‌లు

కడప నగరంలో గంజాయి, ఇంక్షన్, సొల్యుషన్ పీల్చే బ్యాచ్‌లు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. అల్మాస్‌పేట, వక్కలపేట, చిలకలబావి, ఖలీల్‌నగర్, బుగ్గవంక ప్రహరీ ప్రాంతాల్లో ఎక్కువ మంది యువకులు గంజాయి, ఇంజక్షన్లు వాడుతూ కనిపిస్తున్నారు. అలాగే రవీంద్రనగర్, తిలక్‌నగర్, బిల్టప్ సర్కిల్, అంగడివీధి ప్రాంతాల్లో 12 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాల వారు అధికంగా ఈ మత్తుకు బానిసై తిరుగుతున్నారు. ఇటువంటి వారిపై తల్లిదండ్రులు, అధికార యంత్రాంగం దృష్టి సారించి అదుపు చేయకపోతే రేపటి యువత భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశాలున్నాయని పలువురు అంటున్నారు.

### నిఘా ఏదీ..?

వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిఘా కొరవడ్డంతోనే వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే మాత్రలు, ఇంజక్షన్లు అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో యువత మత్తుకు బానిస అవుతున్నారు. అలాగే మత్తులో జోగుతున్న యువతను పోలీసులు గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం.. జనావాసాలకు దూరంగా ఏకాంత ప్రదేశాల్లో మత్తుసేవించే వారిపై నిఘా పెంచకపోడం పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మత్తుతో ఊగే యువత పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

## రేపటి నుంచి అన్నమయ్య వర్ధంతి వేడుకలు



రాజంపేట, ఏప్రిల్ 3: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి వేడుకలను టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బుధవారం తాళ్లపాక ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో, బోయనపల్లెలోని 108 అడుగుల విగ్రహం వద్ద టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తాళ్లపాక గ్రామంలోని అన్నమాచార్య ధ్యానమందిర ప్రాంగణంలో సప్తగిరుల సంకీర్తనా గోష్ఠిగానం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు కె.శ్రీనివాస బృందం వారిచే సంగీత సభ, వై.రమేష్‌బాబు బృందం ఆధ్వర్యంలో హరికథ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు ఎం.బి.లోకనాధం బృందం వారిచే సంగీత సభ, వై.శ్రీనివాస్ బృందం వారిచే హరికథ, 7వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఎం.మోహన్ బృందం వారిచే సంగీత సభ, అనంతరం కె.చంద్రశేఖర్ బృందం వారిచే హరికథ, 8న ఎం.రవిచంద్ర బృందం వారిచే సంగీత సభ, ఎం.పూర్ణిమ బృందం వారిచే హరికథ కాలక్షేపాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలు 4వ తేదీ నుంచి తిరుపతి అలిపిరి పాదాల మండపం అన్నమాచార్య కళా మందిరం వద్ద ప్రారంభమవుతాయని తెలిపారు. 5వ తేదీ అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామం నారాయణగిరిలో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు
- మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

సుండుపల్లె, ఏప్రిల్ 3: మండలంలోని పొలిరపల్లె గ్రామ పంచాయతీ గుంతరాచపల్లె సమీపంలో సంబేపల్లె మండలం ఊటుపాలెంకు చెందిన కొండమల్ల ఈశ్వరయ్య (50) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా బుధవారం తెలిపారు. వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించామన్నారు. సోమవారం పూజారివాండ్లపల్లె చింతకూటమ్మ తల్లి తిరుణాలకు మృతుడు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, ఎస్ఐ ఎస్‌కేయం హుస్సేన్, ఏఎస్ఐ వెంకట్రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కలుషిత నీరు తాగి 22 గొర్రెలు మృతి




చనిపోయిన గొర్రెలు, కలుషిత నీరు ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వెటర్నరీ డీడీ వెంకటరమణ

చెన్నూరు, ఏప్రిల్ 3: చెన్నూరు గ్రామ వ్యవసాయ పొలాల్లో కలుషిత నీరు తాగి 22 గొర్రెలు మృతి చెందాయి. ఇటుక బట్టీలకు వాడే నీటిలో రసాయనిక ఎరువులు కలపడం వల్ల ఆ నీటిని తాగడంతో గొర్రెలు మృతి చెందాయని దాదాపు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండ్లిమర్రి మండలంలోని పలు గ్రామాలకు చెందిన గొర్రెల పెంపకందారులైన వడ్డారపు చిట్టిబాబు, పి.గంగరాజు, బి.గంగిరెడ్డి, బి.ప్రసాద్, ఆంజనేయులు తదితరులు దాదాపు నెలరోజులుగా చెన్నూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గొర్రెలు మేపుకుంటున్నారు. మూడురోజుల క్రితం చెన్నూరు బుడ్డాయపల్లె గ్రామ సమీపంలో వ్యవసాయ పొలాల్లో రాత్రివేళ గొర్రెలను ఉంచుకుని వాటిని మేపుకుంటున్నారు. బుధవారం ఉదయం సమీపంలోని ఇటుకబట్టీల వద్దకు గొర్రెలు వెళ్లి నీరు తాగడంతో 22 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మొదట గొర్రెల పెంపకందారులకు ఏమీ అర్థం కాలేదు. తీరా అవి కలుషితనీరు తాగడంతో మృతి చెందాయని తెలుసుకుని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసిన పశువైద్యశాఖ డీడీ వెంకటరమణ, ల్యాబ్ వైద్యులు రాంబాబు, ఖాజీపేట చెన్నూరు పశువైద్యాధికారులు మురళి, డాక్టర్ ఉపేంద్రలు చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. మిగిలిన గొర్రెలు కూడా అస్వస్థతకు గురి కావడంతో వాటికి చికిత్స చేశారు. గొర్రెల మృతిపై విచారణ చేపడతామని వారు తెలిపారు. ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, గొర్రెల పెంపదారుల జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, అటవీశాఖ డైరెక్టరు శ్రీలక్ష్మి తదితరులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులకు ప్రభుత్వపరంగా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

## ఇరువురికి జైలు శిక్ష

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: చోరీ కేసులో ఇరువురు నిందితులకు రెండు నెలల సాధారణ జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం అడిషినల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద తీర్పునిచ్చారు. ఫిబ్రవరి 19న రాత్రి రాయుడు కాలనీకి చెందిన ఎదివీటి దేవుడు, షేక్ ఫయాజ్ రాయచోటి పట్టణంలోని కొత్తపేట విజయవాడ స్కూల్ సమీపంలో నివాసముంటున్న గుంటిమడుగు త్యాగరాజు ఇంటిలో ఇన్వర్టర్ బ్యాటరీని చోరీ చేశారు. రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుపై విచారించిన మేజిస్ట్రేట్ వీరిరువురికి జైలుశిక్ష, జరిమానా విధించారు.



## డ్రైవరు మృతి



బద్వేలు టౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని మైదుకూరు రోడ్డు జాతీయ రహదారిలో బుధవారం లారీ డ్రైవ రు గోరోజు అశోక్ (32) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మూడురోజుల నుంచి లారీ రోడ్డు పక్కన ఆపుకుని ఉన్నాడని, బుధవారం మధ్యాహ్నం కూడా లారీ రిపేరు చేసుకోవడం గమనించామని అన్నారు. ఎండ అధికంగా ఉండడంతో వడదెబ్బకు గురి కావడంతో మృతి చెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం సూర్యపేట జిల్లా వింపటి గ్రామానికి చెందిన డ్రైవరు అశోక్‌గా పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఇరువురికి గాయాలు



ఘర్షణలో గాయపడ్డ రామాంజనేయులు, సయ్యద్ జాఫర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రహదారి ఎస్పీ బంగ్లాకు సమీపంలో స్థల విషయంపై బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. సర్వే నెంబర్ 374/4ఏలో 20 సెంట్ల స్థలం పల్లపు రామాంజనేయులు అనుభవంలో ఉంది. అయితే పల్లపు రామాంజనేయులు వర్గం వారు ఆ స్థలంలో గునాది కట్టడానికి ప్రయత్నిస్తుండగా సయ్యద్ జాఫర్ అనే వ్యక్తి అక్కడికి వెళ్లి ఇందులో నాకు కూడా హక్కు ఉందంటూ అడ్డుపడడంతో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగింది. రెండు వర్గాల మధ్య వివాదం నెలకొనడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు వర్గాల్లోని వారు పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో పల్లపు రామాంజనేయులతో పాటు సయ్యద్ జాఫర్‌లు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా... ఘర్షణకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

# పండుటాకుల పడిగాపులు...

**ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం, పింఛన్ల కోసం నిల్వ చేసిన రూ.2 వేల కోట్ల నిధులను కాంట్రాక్టర్లకు చెల్లించేయడం, బుధవారం సాయంత్రానికిగానీ ఆ నిధులను సమకూర్చుకోలేకపోవడంతోనే పింఛన్ల పంపిణీ ఆలస్యమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాంకులకు సెలవుల కారణంగా నిధులు విడుదల చేయడంలో ఆలస్యం జరిగిందని ప్రభుత్వం చెపుతున్నా అది కూడా వాస్తవం కాదని, 30వ తేదీన బాంకులు పూర్తి స్థాయిలో పనిచేశాయని, ఆ రోజే నిధులు విడుదల చేసుంటే ఈ నెల 1వ తేదీనే పింఛన్ల పంపిణీ జరిగేదని కూడా పలువురు చెపుతున్నారు.**


కలికిరి: పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కలికిరి, ఏప్రిల్ 3: గ్రామ సచివాలయాల వద్ద బుధవారం పింఛన్లు పంపిణీ చేస్తారనే సమాచారంతో అన్ని సచివాలయాల వద్ద పింఛనుదార్లు పడిగాపులు కాశారు. పింఛన్ల సొమ్ము బ్యాంకుల్లో జమ కాకపోవడంతో సాయంకాల వరకూ పంపిణీ మొదలు కాలేదు. సాయంకాలం నాలుగు గంటలకు సొమ్ము చేతికందగానే సచివాలయ సిబ్బంది పంపిణీ మొదలు పెట్టారు. ఒక్కో పింఛను పంపిణీకి రెండు నుంచి నాలుగు నిముషాలు సమయం పడుతోందని సచివాలయ సిబ్బంది చెపుతున్నారు. గురువారం ఉదయం నుంచి పంపిణీ ప్రారంభిస్తే సాయంకాలానికి పంపిణీ పూర్తయిపోతుందని కూడా అంటున్నారు.

మండలంలో 7185 మంది పింఛనుదారులుండగా. 14 సచివాలయాల నుంచి కనీసం 140 మంది ని పంపిణీకి కేటాయించినా ఒక్కొక్కరు సగటున 50 పింఛన్లు మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా వేసవి తీవ్రత కారణంగా గ్రామాల నుంచి సచివాలయానికి వచ్చి పింఛన్లు తీసుకోవడానికి వయోవృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ళ వద్దనే పింఛన్లు పంపిణీ చేయించాలని పలువురు టీడీపీ నాయకులు కూడా డిమాండు చేస్తున్నారు. నాలుగేళ్ళుగా ఇళ్ళ వద్దనే పంపిణీ చేసి ఇప్పుడు ఇలా తిప్పుకోవడం వృద్ధులను ఇబ్బంది పెట్టడమేనని కూడా వీరు విమర్శిస్తున్నారు. కాగా, మండలంలోని 14 సచివాలయాల్లో బుధవారం సాయంకాలం నాలుగు గంటలకు పంపిణీని ప్రారంభించగా రాత్రి 7 గంటలకు 25 శాతం పైగా పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో రామకృష్ణ చెప్పారు. మొత్తం 7,186 పింఛన్లు పంపిణీ చేయాల్సి వుందని ఇందులో దాదాపు 1800 పింఛన్ల పంపిణీ పూర్తి చేపినట్లు వివరించారు. అన్ని సచివాలయాల్లోనూ అందుబాటులో వున్న సిబ్బంది అందరినీ పింఛన్ల పంపిణీకి పురమాయించినట్లు ఆయన తెలిపారు.


వాల్మీకిపురం: పింఛన్ కోసం పడిగాపులుకాస్తున్న వృద్ధులు, వికలాంగులు

**వృద్ధులు, వికలాంగుల ఇక్కట్లు**

**వాల్మీకిపురం:** మండలంలో 14 గ్రామ సచివాలయాలుండగా 6034 మంది పింఛన్‌దారులున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామ వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ ప్రక్రియ నిలిచిపోగా, బుధవారం గ్రామ సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నారనే సమాచారం మేరకు ఉదయం 7 గంటలకే అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2గంటలు కావస్తున్నా అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. తిండీతిప్పలు లేకుండా మండుటెండలో చెట్లకింద అవస్థలు పడ్డారు. ఈ విషయమై ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నానికి నగదు డ్రా చేసి పంపిణీ చేస్తామన్నారు. అంతే మధ్యాహ్నం 3గంటలు దాటినా పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో పలువురు వృద్ధులు నిరాశగా వెనుదిరిగారు. చివరికి 5 గంటల తర్వాత పంపిణీ ప్రారంభించారు


బికొత్తకోట: తాకాటంవారిపల్లి సచివాలయం ఎదుట పడిగాపులు గాస్తున్న పింఛన్‌దారులు

**బి కొత్తకోట :** మండలంలో 6475 మంది పింఛన్‌దారులు ఉండగా వారంతా సచివాలయాల వద్ద సాయంత్రం దాకా ఎదురుచూశారు. ఓపిక ఉన్నవాళ్లు అక్కడే వేచివుండగా, లేనివాళ్లు తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఎట్టకేలకు సాయంత్రం 6 గంటలకు హడావుడిగా ఒకరిద్దరికి పింఛన్ సొమ్ము అందజేసి మమ అనిపించారు. దూరప్రాంతాల నుంచి పింఛను కోసం కాళ్లీడ్చుకుంటూ సచివాలయాల వద్దకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు తిండి,తిప్పలు లేక అలమటించారు. పింఛను సొమ్ము రూ.2.40 కోట్ల పైచిలుకు మొత్తం చేతికి వచ్చిందని గురువారం నుంచి పంపిణీ వేగవంతం చేసి, పూర్తి చేస్తామని ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు.

## గుండెపోటుతో ప్రయాణికుడి మృతి


గుండెపోటుతో మృతి చెందిన అహ్మద్ బాషా

కురబలకోట, ఏప్రిల్ 3: బస్సులో ప్రయాణిస్తుండగా గుండెపోటు రావడంతో ఓ వృద్ధుడు మరణించాడు. గుర్రంకొండకు చెందిన అహ్మద్ బాషా(63)కు ఇటీవల గుండెపోటు రావడంతో మదనపల్లెలోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించారు. ఈ నేపథ్యంలో బుధవారం వైద్య పరీక్షల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలసి మదనపల్లె ఆసుపత్రికి వచ్చిన ఆయన ఆర్టీసీ బస్సులో స్వగ్రామానికి వెళుతూ అంగళ్ళ వద్దకు రాగానే స్పృహ కోల్పోయాడు. దీంతో అతని వెంట వచ్చిన వారు నీళ్ళు తాగించడానికి ప్రయత్నిస్తుండగానే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని గుర్రంకొండకు తరలించారు.

## వాహనాల తనిఖీలో రూ.లక్ష పట్టివేత

కలకడ, ఏప్రిల్ 3:ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్ఐ రామకృష్ణారెడ్డి మండలంలోని బాటవారిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరుపతికి చెందిన సౌందర్య అనే మహిళ వద్ద రూ.లక్ష నగదు తీసుకువెళుతూ పట్టుబడింది. దానికి సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును పీలేరు ఆర్వో ద్వారా రాయచోటి ఖజానాలో డిపాజిట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బేకరీపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు


తినుబండారాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ షమీంబాషా

మదనపల్లె, ఏప్రిల్ 3: స్థానిక గొల్లపల్లెలోని ఓ బేకరీపై బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. కాలంచెల్లిన పదార్థాలు నిల్వ ఉంచడంతోపాటు, వాటిని అమ్ముతున్నట్లు గుర్తించి.. సీజ్ చేశారు. ఫుడ్ సర్టిఫికెట్ లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ స్థాయిలో రంగులు ఉన్నాయో తెలుసుకోవడానికి శాంపిల్స్‌ను సేకరించారు. నిర్వాహకులు విచారణకు సహకరిస్తే స్టాకు మాత్రమే సీజ్ చేస్తామని, లేకుంటే దుకాణాన్నే సీజ్ చేస్తామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.షమీంబాషా తెలిపారు. .

## కాంగ్రెస్ పార్టీ నేతల సంబరాలు..

బి కొత్తకోట, ఏప్రిల్3: తంబళ్లపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా బి కొత్తకోటకు చెందిన ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి ఎంపిక కావడంతో బి కొత్తకోటలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక జ్యోతి బస్టాండు సర్కిల్‌లో టపాసులు పేల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. అభ్యర్థిగా ఎంపికైన చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ తనకు టికెట్ ఇచ్చేందుకు సహకరించిన సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, తులసిరెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తంబళ్లపల్లెలో కాంగ్రెస్‌పార్టీ సత్తా చూపుతామన్నారు.

## విశ్రాంత డీవైఈవోకు సన్మానం

పీలేరు, ఏప్రిల్ 3: తిరుపతి జిల్లా డీవైఈవోగా ఇటీవల పదవీ విరమణ చేసిన ఎం.ఆనంద్ రెడ్డిని బుధవారం పీలేరు మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. పీలేరు ఎంఆర్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆనంద్ రెడ్డిని పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి, హెచ్ఎంలు తాటిపర్తి గంగాధర్, ప్యారూఖాన్, సురేంద్రనాథరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శోభారాణి, నాగరత్నమ్మ, పార్వతమ్మ, ఫౌజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3: ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు పోలింగ్‌లో పాల్గొని ఓటు వినియోగించుకోవాలని ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో సీప్ ప్రోగ్రాంపై వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన వారందరిని కళాశాలలు, ఎన్‌సీసీ అధికారుల సహకారంతో ప్రాస్పెక్టస్ ఓటరుగా నమోదు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి వారు 500 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. ఏప్రిల్ 1వ తేదీకి వీరికి 18 ఏళ్లు నిండుతాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏఆర్వో అధికారులు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం

● టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా


ఇంటింటి ప్రచారం చేస్తున్న షాజహాన్‌బాషా తదితరులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 3: ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం అని ఉమ్మడి టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీలో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ు రూ.4వేలు పింఛన్, ఆర్టీసీ బస్సుల్లో మహిళల కు ఉచిత ప్రయాణం, నెలకు రూ.1500, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, విద్యార్థులకు రూ.15 వేలతో పాటు, బీసీలకు 50 ఏళ్లకే ఫించన్ ఇస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం సామాన్యుల జీవితాలను అతలాకుతులం చేస్తి, అన్యాయంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. వలంటీర్ల ద్వారా ఫించన్‌లు పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధిస్తే దానికి కారణం చంద్రబాబు అని చెప్పడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న పనులన్నీ ప్రజలు గమనిస్తున్నారని జగన్‌కు గుణ పాఠం చేప్పే సమయం అసన్నమైందన్నారు. మే13న జరిగే ఎన్నికల్లో వైసీపీని తగిన గుణపాఠం చెప్పి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టే వెంకటేష్, రాజన్న, నవీన్, శ్రీపతి, శ్రీనివాసులు, బాస్కర, రవి, మల్లప్ప, రెడ్డెప్ప, జయన్న తదితరులు పాల్గొన్నారు.

**మదనపల్లె టౌన్,:** మదనపల్లె టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బుధవారం మండలంలోని డ్రైవర్స్ కాలనీ, కురవంక పంచాయతీల్లో ఇంటింటికి తిరుగు తూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తూనే మెగా డీఎస్సీపై తొలి సంతకం పెడతారని లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లిలో పారిశ్రామికాభివృద్ధికి కృషి

● టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి


అంగళ్ళులో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

కురబలకోట, ఏప్రిల్ 3: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అంగళ్లు, ఇందిరానగర్, పోరెడివారిపల్లె, తుమ్మచెట్లపల్లె తదితర గ్రామాల్లో ఆయన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తంబళ్లపల్లెను పారిశ్రామిక కారిడార్‌గా గుర్తించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే తంబళ్లపల్లెను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వలసలను నివారించి శాశ్వత జీవనోపాధిని కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును తిరిగి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ, ఆయన నాయకత్వానికి మద్దతు పలకాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేసి టీడీపీ గెలుపునకు పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, మీరు ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో గెలిపించి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధానకార్యదర్శి అయూబ్‌బాషా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర, మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర, తంబళ్లపల్లె తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, డిఆర్ వెంకటరమణారెడ్డి, రామచంద్ర, మోహన్‌రెడ్డి,సదాశివ, తెట్టు ఉపసర్పంచ్ ముస్కీన్‌వలి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పీటీఎం గంగమ్మకు సారె**

**పెద్దతిప్పసముద్రం :** మండల కేంద్రంలోని నడివీధి గంగమ్మకు జయచంద్రారెడ్డి తన సతీమణితో కలసి చీర, సారె సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ శివారు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు చంద్రశేఖర(చిన్నా), చంద్రమోహన్‌రెడ్డి భజంత్రి రామచంద్ర, జనసేన మండల అధ్యక్షుడు శంకర, గ్రామ అధ్యక్షుడు కత్తి ఆదినారాయణ, పాలగిరి రామాంజులు, కార్యం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పాపం వైసీపీదే : నల్లారి


వేపులబైలులో కిశోర్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పీలేరు, ఏప్రిల్ 3: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జాప్యం కేవలం వైసీపీ నిర్లక్ష్యమేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి విమర్శించారు. పీలేరు పట్టణంలోని కోటపల్లె, మండలంలోని వేపులబైలు పంచాయతీలో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన విధంగా పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం స్పష్టంగా నిర్దేశించినా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిందన్నారు. తమకు కావాల్సిన వారికి కోట్లాది రూపాయల మేరకు బిల్లులు చెల్లించుకున్న ప్రభుత్వం పేదలకు ఇవ్వాల్సిన పింఛన్ల సొమ్మును మాత్రం సర్దుబాటు చేయలేకపోయిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే వైసీపీ నాయకులు టీడీపీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వలంటీర్ల తొలగింపు పాపం పూర్తిగా వైసీపీదేనన్నారు. పింఛన్ల పంపిణీకి తమ పార్టీ పూర్తిగా అనుకూలమని, రాష్ట్రంలో సామాజిక భద్రతా పింఛన్లను ప్రారంభించింది టీడీపీయేనన్నారు.

**వైసీపీలో భారీగా చేరికలు**

పీలేరు పట్టణానికి చెందిన పీలేరు ఏఎంసీ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి సమీప బంధువు జీవీ నరేశ్ రామ్‌కుమార్ రెడ్డి బుధవారం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వేపులబైలు పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, ఎన్.హరినాథరెడ్డి, నాగభూషణ్, నాగయ్య, తెల్లమేకల శ్రీనివాసులు, గాయం గుణశేఖర్ రెడ్డి, తదితరులు తమ కుటుంబాలతో సహా టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారందరినీ కిశోర్ కుమార్ రెడ్డి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కూటమి విజయానికి శ్రమిస్తాం


ఐక్యతను చాటుతున్న బీసీ నాయకులు

కలకడ, ఏప్రిల్ 3: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీల విజయానికి పని చేస్తామని బీసీ నాయకులు ముక్తకరంతో పిలుపునిచ్చారు. బుధవారం కలకడ టీడీపీ కార్యాలయంలో ఆ సంఘం నా యకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రకటించిన డిక్లరేషన్ మేరకు 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్లు అందుతాయన్నారు. నెలవారీ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెరుగుతుందన్నారు. బీసీలపై దాడులు, దౌర్జన్యాలు జరగకుండా ప్రత్యేక చట్టం అమలు చరిత్రలో ఓ ఘట్టం అవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల పోటీ విషయంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ప్రత్యేక చట్టాల అమలుకు పూనుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమం లో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, పలిగట్ల వెంకటరమణ, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జనార్దన్‌గౌడ్, కాంతారావు, రైస్‌మిల్ రమణ, బీవీనాయుడు, జ్ఞానేశ్వర్, వాటర్‌షెడ్ రవి, లక్ష్మీప్రసన్న, తారకేశ్వర, జిలానీ, కరీముల్లా, ఇనాయతుల్లా, ప్రసాద్‌నాయుడు, ఇర్ఫాన్, ఖాజా, అలీ తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతి సినిమా చూపించిన జగన్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3: సిద్ధం బహిరంగ సభలో మదనపల్లె ప్రజలకు సీఎం జగన్ అరుంధతి సినిమా చూపించాడని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఎద్దేవా చేశారు. బుధవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మదనపల్లెకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ఆయన, ఇప్పుడైనా వరాల జల్లు కురిపిస్తాడని అనుకున్న ప్రజల ఆశలపై నీళ్ల జల్లి వెళ్లిపోయాడన్నారు. మదనపల్లెకు జిల్లా రాకుండా మోసం చేసింది వైసీపీ అన్నారు. బీటీ కళాశాలను యూనివర్సిటీ చేస్తామని చెప్పి తప్పుదోవ పట్టించారన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అన్నీ అబద్ధాలే చెప్పాడన్నారు. కానీ మిథున్‌రెడ్డి జూన్4వ తేదీన సూట్‌కేసు సర్దుకుని బయలుదేరడం ఖాయమన్నదొక్కటే నిజం అన్నారు. ప్రజా సంక్షేమం కోరే బహుజన సమాజ్‌పార్టీ గుర్తు ఏనుగు గుర్తును ఆదరించాలని పిలుపునిచ్చారు. వైసీపీ సభలో అడుగడుగునా కోడ్ ఉల్లంఘన జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. బీఎస్పీ ప్రచారం కోసం పది రోజుల నుంచి అనుమతి అడుగుతుంటే మదనపల్లె డీఎస్పీ, ఆర్వోలు కుంటిసాకులు చెబుతున్నారన్నారు.

## మాజీ సీఎం కిరణ్‌కు అభినందనల వెల్లువ


మాజీ సీఎం నల్లారి కిరణ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేత సుధాకర్‌నాయుడు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ఆయన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు అభినందనలతో ముంచెత్తారు. 2014 రాష్ట్ర విభజన వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో వుంటూ ముఖ్యమంత్రిగా మదనపల్లెకు వచ్చిన కిరణ్ బీటీ కళాశాలలో నిర్వహించిన జనగణమన గీతం వందేళ్ల ఉత్సవాల్లో పాల్గొన్నారు. అప్పట్లోనే బీటీ కళాశాల అభివృద్ధికి గ్రంథాలయ నిర్మాణానికి, రవీంద్రనాథ్ కాటేజీ అభివృద్ధికి, ప్రహరిగోడ నిర్మాణానికి రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. అనంతరం పదేళ్ల పాటు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా వున్న కిరణ్ ప్రస్తుతం రాజంపేట పార్లమెంట్ బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగడంతో పాటు తొలి సారి మదనపల్లెలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. దీంతో పట్టణంలోని కిరణ్ అభిమానులు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పెద్దసంఖ్యలో వచ్చి కిరణ్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి, శాలువలు కప్పి అభినందించారు. టీడీపీ సీనియర్ నేత మార్పురి సుధాకర్‌నాయుడు, రాందాస్‌చౌదరి, శ్రీరామ్‌చినబాబు, రాటకొండ బాబురెడ్డి తదితరులు నల్లారి కిరణ్‌ను అభినందించారు.

## స్ట్రాంగ్ రూంలు పరిశీలించిన జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

పీలేరు, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల కోసం స్ట్రాంగు రూము ఏర్పాటుకు ఎంపిక చేసిన పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్, పీలేరు నియోజకవర్గ ఆర్వో ఫర్మాన్ అహ్మద్ పరిశీలించారు. కళాశాలలోని వసతులు, వాహనాల రాకపోకలకు అనువైన మార్గాలను ఆయన పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో చేయాల్సిన పలు మార్పులపై కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి, ఏఈఆర్వో మహబూబ్ బాషాకు సూచించారు. అనంతరం పీలేరు తహసీల్దారు కార్యాలయంలో జరిగిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి అన్ని రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోపు తాము అనుమతులు మంజూరు చేస్తున్నామని, అనుమతి లేకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టును విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో రమ, టీడీపీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, సుబహాన్, రామ్మూర్తి, వైసీపీ నాయకులు షాకీర్, గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు సోమశేఖర రెడ్డి, డీటీలు సుబ్రహ్మణ్యం, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రాంగణంలో చెత్తాచెదారం వేస్తే చర్యలు


జరిమానా విధిస్తున్న కదిరి రైల్వే పోలీసులు

ములకలచెరువు, ఏప్రిల్ 3: రైల్వే ప్రాంగణంలో చెత్తాచెదారం వేస్తే చర్యలు తప్పవని కదిరి రైల్వే ఏఎస్ఐ శివారెడ్డి హెచ్చరించారు. ములకలచెరువులో బుధవారం పరిసరా ల పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రాంగణంలో చెత్తాచెదారం, కోళ్ళ వ్యర్థాలు వేస్తున్న దుకాణదారులకు జరిమానా విధించారు. 23 మంది దుకాణదారులకు రూ.4600 జరిమానా విధించి నగదును స్థానిక రైల్వేస్టేషన్‌లో జమ చేశారు. హెడ్‌కానిస్టేబుళ్ళు రవికుమార్, గురుమూర్తి పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలి

పీలేరు, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్ల ను లబ్దిదారుల ఇళ్ల వద్దకే చేర్చాలని పీలేరు మండల టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం పీలేరు ఎంపీ డీవో ఉపేంద్ర రెడ్డికి వినతిపత్రం అంద జేశారు ఎన్నికల ప్రక్రియలో వలంటీర్ల ప్రమేయాన్ని నివారించమని ఎన్నికల సంఘం ఆదేశించడంతో, టీడీపీని అభాసుపాలు చేసేందుకు వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల వద్దకు లబ్ధిదారులను పిలిపించకుండా సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పింఛను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, ఖాదర్‌బాషా, హనీఫ్, చంద్ర, శ్రీనివాసులు, శేఖర, తదితరులు పాల్గొన్నారు.

## సైన్సుపై అవగాహనతోనే విద్యార్థుల ప్రగతి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3: సైన్సుపై అవగాహనతోనే విద్యార్థులు ప్రగతి సాధిస్తారని ఎస్వీ యూనివర్సిటీ ప్రొ ఫెసర్లు విజయభాస్కరరావు, దేవ ప్రసాదరాజు తెలిపారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన ఇండియన్ సైన్సు అకాడమీ అవగా హన సదస్సులు ముగిసాయి. ఈ సందర్భంగా యూజీసీ సభ్యుడు ప్రొఫెసర్ జయశంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

## జాతరకు చింతపర్తి గంగమ్మ ఆలయం ముస్తాబు

వాల్మీకిపురం, ఏప్రిల్ 3: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగార మైన వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో బాహుదా నది ఒడ్డున వెలసిన గుంటి గంగ మ్మ ఉత్సవాలు గురువారం నుం చి వైభవంగా ప్రారంభం కా ను న్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ఆలయంలో మహా చండీ యాగం నిర్వహి స్తున్నారు. గురువారం ఉదయం ఆలయంలో అభిషేకం, అర్చన చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. అదే రోజు దీలు, బోనాల సమర్పణ, రాత్రికి చాందిని బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. ఈ సందర్భంగా అన్నదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

## టీడీపీ సీనియర్ నేత మృతి.. నల్లారి సంతాపం

వాల్మీకిపురం, ఏప్రిల్ 3: మండలం లోని పత్తేపురం గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నేత నూతన కాల్వ చిన్నపరెడ్డి(90) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసు కున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధ వారం ఆ గ్రామానికి చేరుకుని చిన్నప రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ కుటుం బానికి అత్యంత సన్నిహితులైన చిన్నపరెడ్డి లేని లోటు తీరనిదని కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులు వెంకటరమణారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు కోసూరి చంద్రమౌళి, ఆనంద రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి

కలకడ, ఏప్రిల్ 3: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు అన్నారు. బుధవారం పాఠశాల్లో సేవ్ ఎర్త్ సేవ్ ఎనర్జీ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవులు భూమిపై వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వృక్షాలను సంరక్షించి భవిష్యత్‌లో అవసరాల కోసం విద్యుత్‌ను పొదుపుగా వాడాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

## 8న మాదిగల చలో గుంటూరు

పీలేరు, ఏప్రిల్ 3:గుంటూరు కేంద్రంగా ఈనెల 8న నిర్వహించేఎమ్మార్పీఎస్ రాష్ట్ర సమీక్ష సమావేశాన్ని జయప్రదం చేయాలంటూ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ పిలుపునిచ్చారు. పీలేరులో బుదవారం ఎంఎస్‌పీ ఇన్‌చార్జి వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎర్రయ్య, విశ్వనాథ్, చరణ్‌కుమార్, రమణ, శ్రీరాములు, నాగేశ్వరరావు, నాగేంద్ర, వెంకటరమణ, దయాకర్, మల్లికార్జున్, భాస్కర్, అన్నవరం, రాజశేఖర్, అజయ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ఎంజేఆర్ కళాశాలలో జెనిత్ 2కే24 ఉత్సవాలు


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎంజేఆర్ యాజమాన్యం

పీలేరు, ఏప్రిల్ 3: పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జెనిత్ 2కే24(నేషనల్ స్టూడెంట్స్ టెక్నికల్ సింపోజియం) నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 128 మంది విద్యార్థులు హాజరయ్యారు. పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, టెక్నికల్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎం.అవినాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి ప్రశంసాపత్రాలు, మొమెంటోలు అందజేశారు. సినీ హీరోయిన్ స్పందన, జబర్దస్త్ యాక్టర్స్ ముక్కు అవినాశ్, రవికిశోర్, తాగుబోతు రాజమౌళి తమ స్కిట్‌లతో విద్యార్థులను అలరించారు. విద్యార్థులు కూడా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.